





# సౌభాగ్యవతి

కళ్యాణసుందరీ జగన్నాథ్

**కాని, ఒకటి మాత్రం నిజం. ఆవిడ గర్విగాదు. అలా గని కొంత మంది అనుకుంటారే గాని. ఇంతకీ గర్వం ఒక పెద్ద గర్వకారణమేమీ కాదుగా.**

మరిఅదేమిటో అంతమౌనం. ఆమెనోట ఎవరైనా, ఎప్పుడైనా మహా అయితే ఒక మాట వింటారేమో, అదైనా అరుదుగా, బంధువు లెవరైనా ఇంటికొస్తే ఏ మూడు దినా లయ్యాకో "ఎప్పుడొచ్చారు?" అని ముక్త సరిగా పలుకరించి జవాబైనా ఎదురు చూడ దావిడ.

అసలు శ్రీదేవిగారు కాస్త సంపన్నురాలాయె. మాట్లాడవలసిన బాధ్యతలూ ఎక్కువగా లేవు. ఇంట్లో వంటలూ, వడ్డింపులూ- విధవాడ బడుచు చూస్తూండేవారు. రమణ మూర్తిగారు భారతం చదువుకుంటూ పడక కుర్చీలో కూర్చుని ఉండేవారు. చుట్టూ గరిసెల నిండా ధాన్యం, పాడి పంటలూ, అతిథులూ, అభ్యాగతులూ, పూజలూ పునస్కారాలున్నూ-చక్కని కుటుంబం, లక్షణంగా, బంగారు బొమ్మలా, ఆభరణాలంకారాలతో శ్రీదేవిగారు, కాలి మట్టెల రవళితో, మౌనంగా తిరుగుతూంటే ఆవిణ్ని మెచ్చని ప్రాణిలేదు. శ్రీదేవిగారికి తన ప్రపంచమే తనది. తానే తన ప్రపంచం. తనకి తాను కాక మిగతా వారు తన భర్త, తన ఏకైక పుత్రుడు. భర్త అంటే పసుపు కుంకుమలు. కొడుకంటే తనసర్వం.అంతే. అదే శ్రీదేవిగారి విచిత్ర మానసిక పరిధి.

పసుపు చెంపలతో నుదుట పట్టెడు కుంకుమతో ఆవిడ ఎదురొస్తేనే చాలనుకునేవాళ్లు చాలా మంది. పెళ్ళి అంతా సిద్ధమయ్యాక తాంబూలాలు ఇచ్చి పుచ్చుకోడానికెళ్ళేవాళ్ళు గొడుగు ఖండువాలతో వాళ్ళ ఆడవాళ్ళని శ్రీదేవిగారింటికి పంపించి "కాస్త నాలుగడుగులు ఎదురు రండమ్మా" అని ప్రతిమాలించే వారు.

ఎటొచ్చీ మౌనం ఒక్కటే. బయట పనులన్నీ చెయ్యడానికి ఇంటి పాలేరు ఏనాది అంకులూ, దాసీ పని చెయ్యడానికి అతని భార్య వున్నారు. అలవాటయిన వాళ్లు అడక్కుండానే చేసుకుపోతారు పనులన్నీ.

అంకాలు మూడేళ్ళ కొడుకు ఒకసారి వాళ్ళ పేటలో ప్రక్కింటికి వెడితే ఆ ప్రక్కింటి ముక్కోపి ముసలిది పొమ్మని ఛటుక్కున ఒక్కటేసిందట. పిల్లాడికి డొక్కలో దెబ్బ తగిలిందట. పిల్లవాడు ఉక్కిరి బిక్కిరిగా ఊపిరి వదిలాడట, అంకాలు భార్య పరుగెత్తుకుంటూ వెళ్లి ఆ ముసలి దానిని తిట్టి ఏడ్చే ఆ పిల్లాణ్ని ఎత్తుకొచ్చేసిందట. ఆ వెనుక జడుపు మీదనో దెబ్బమీదనో వాడు జ్వరం పడ్డాడట. తిండి తగ్గిపోయింది. జ్వరం పూర్తిగా ఎన్నడూ వదలలేదు. అలాగే తీసుకొని తీసుకుని ఒక ఆరు నెలలకి ప్రాణం కాస్తా వదిలేశాడు. వయస్సుమళ్ళుతూన్న ఆ బీద దంపతులకు చావగా చావగా మిగిలినది ఆ ఒక్క సంతే. ఈ పైనాలన్నీ ఎప్పటి కప్పుడు ఇంట్లో వింటూన్న శ్రీదేవిగారు "పాపం" అనిగాని, "అయ్యో" అనిగాని అనలేదు. విన్నదా లేదా అనిపించింది, ముఖంలో ఏ మాత్రమూ మార్పులేదు. చెవిటివాడి ముందు శంఖు ఊదినట్టే.

కాని ఆతరువాత ఒకసారి తన పసివాడు శివరామ్‌కి జబ్బుచేసి నప్పుడు మాత్రం ఆవిడ ముఖం వివర్ణ మయిపోయింది.

ఆ నాడు రమణమూర్తిగారు ప్రక్కవూరు పనిమీద వెళ్లారు. విధవాడ బిడ్డ తన జ్ఞాతుల పెండ్లికి వెళ్ళింది. హఠాత్తుగా శివరామ్ తన చేతుల్లో బిగిసి పోయాడు. శ్రీదేవిగారి గుండెలాగి పోయాయి. "అయ్యో! అమ్మో" అనుకుంటూ పిచ్చిదానిమల్లే చేతుల్లో పిల్లాడితో వీధిలోకి పరిగెత్తుకుంటూ వచ్చింది, అంకాలు చుట్ట నోట్లో పెట్టుకుని లోపలికి వస్తూ ఎదురయ్యాడు. ఆవిణ్ని అంత దూరాన చూడంగానే నోట్లో చుట్ట పారెయ్యబోయాడు. తొందరగా మరుక్షణంలో ఆవిడ ముఖమూ పరుగుచూసి గాభరా పడి "ఏందమ్మగారూ? ఏందిది?'' అంటూ ముందుకి అంగలు వేసుకుంటూ వెళ్ళాడు. వెంటనే అతని కర్థ మయింది. "చిన్న బిడ్డ గుణమండీ! సూత్తారేం" అని అంటూనే చేతిలో

కాల్తూవున్న చుట్టతో బిడ్డ నుదుటిమీదా వెనకా వాతలు పెట్టాడు. బిడ్డ కేరుమని ఏడ్చాడు. శ్రీదేవిగారు బిడ్డని రొమ్ము కద్దుకుంది. అంతే. అలాగే అంకాలు కేసి తిరిగి చూడనైనా చూడకుండా మండువాలోకి వెళ్ళిపోయింది. అలాగే నిలబడి పోయి అంకాలు "పాపం కన్నకడుపాయిరి. ఏం చేసుద్దీ." అని గొణుక్కుంటూ ముందరికి సాగాడు.

ఆ నాడు తెప్పరిల్లి శివరామ్ "మ్మమ్మ" అన్న స్వరం శ్రీదేవిగారికి ప్రాణం పోసింది. జీవితంలో పరిపూర్ణ సుఖం ఇంకొకటి లేదనిపించింది.

శ్రీదేవిగారు ఎన్నడూ బిడ్డని లాలించి ఎరుగదు. కాని ఆమె సౌభాగ్యానికి మేర లేదు. బరి దాటని కొడుకు, కోపతాపాలెరుగని భర్త, సిరి సంపదలు.

శివరామ్ పెద్ద వాడయ్యాడు. చదువుకుంటున్నాడు. బుద్ధిమంతుడు. అతనికి తల్లి తప్ప వేరేదైవం లేదు. స్కూలు నుంచి వచ్చి "అమ్మా" అని అలా దీర్ఘంగా పిలిస్తే శ్రీదేవిగారు భూత భవిష్యత్తులు మరిచేవారు. చూచిన అమ్మలక్కలందరూ శ్రీ దేవిగారి అదృష్టానికి కొంచెం ఈర్ష్యపడేవారు. శివరామ్‌కి అమ్మ పెట్టింది అమృతం. అమ్మ చెప్పింది వేదం. అంతకి మించి ఆవిడకి కోరదగినదీ వేరేముంది.

పండుగలూ, పబ్బాలూ గడుస్తున్నాయి. శ్రీదేవిగారి పెద్ద తమ్ముడు తల్లిలేని తన ఒక్కకూతుర్నివదలి స్వర్గస్థుడయ్యాడు. ఆ అనాధను రమణమూర్తి గారు ఇంటోకి తెచ్చారు. వయస్సు వచ్చిన ఆ కమలకి పెట్టుపోతల్లో లోటు లేకుండా శ్రీదేవిగారు చూస్తున్నారు-తన ఆడబిడ్డ అప్పటికే కాలం చేసిందిగనుక. మాటామంతీ మాత్రం ముక్తసరే.

ఈపాటికి కాలేజీ వదిలేసి శివరామ్ ఉద్యోగం చేస్తున్నాడు గుమస్తాగా.

ఎప్పుడో చిన్ననాడనుకున్నది తప్ప మళ్ళీ తిరిగీ ఆ ప్రస్తావనే రాలేదు ఎప్పుడూ. అయినా ఇరుగుపొరుగువారి ఊహలు ఊరికే పోకుండా శివరామ్‌కీ, మేనకోడలు కమలకీ రమణమూర్తిగారు, శ్రీదేవిగారు వివాహం చేశారు-తగువైభవంతో.

శివరామ్ మాత్రం ఎప్పటికీ తల్లి బిడ్డే. ఎప్పటిలాగ జీతం తెచ్చి తల్లి చేతుల్లో పొయ్యడం. రోజుకి ఒక అర్ధణా తీసుకొని వెళ్ళడం, ఆఫీసులో సరదాగా వేరుశనగకాయలు కొనుక్కు తినడం. ఇంటి విషయాలలో అతను పట్టించుకొనేవాడేగాదు. పెండ్లి అయిన తరువాతా అంతే.

ఈ పెళ్లి అయిన ఆరు నెలలకే రమణమూర్తి గారికి ఉప్పెనలా ముంచుకు వచ్చింది జ్వరం హఠాత్తుగా ... డాక్టర్లు కారణం తెలుసుకునే లోగానే అంత హఠాత్తుగానూ ఆయన పోయారు.

శ్రీదేవిగారి దుఃఖానికీ, రౌద్రానికీ మేర లేదు. ఈ దరిద్రురాలు ఏ శనివేళ నా ఇంట్లో అడుగుపెట్టిందో? ఇది నా పసుపు కుంకం తుడిచేసింది. దీనిని ఏం చేసినా పాపం లేదు. భగవంతుడు నా పగతీర్చడా-ఏమేమో ఆలోచనలు వచ్చినయి ఆవిడకి-ఘోరమైనవి.

"పువ్వులూ బుక్కాముతో ఆయనచేతుల్లో పుణ్యస్త్రీలా పోదామనుకున్నాను. పసుపు కుంకుమలేనిదే ఏమి బ్రతుకు? శ్రీదేవిగారు పసుపు కుంకుమలేని ఘడియలు జీవితంలో ఎవరికైనా ఉంటాయనే అనుకోలేదు. ఎవరికైనా అంటే తనకే. తను తప్ప తనకి ప్రపంచం ఎవరు? శ్రీదేవిగారి మనసులో బయట ప్రపంచపు ఆలోచనలకి చోటు లేదు-తనూ, భర్త, బిడ్డడు, అంతే. ఇంకే తల్లికి ఏ కొడుకు వుంటే తనకి కావాలి? లేకపోతే ఎవరికి కావాలి? ఇప్పుడు తన పసుపు కుంకుమ పోయిందే!

ఆనాటి నించీ ముక్తసరిగానైనా కోడలితో మాట్లాడ్డం మానేసిందావిడ.

రెండేళ్లు గడిచాయి. ఒకనాడు సాయంత్రపు వేళ నిమ్మళంగా కమల దగ్గింది. శివరామ్ గమనించలేదు. రోజు రోజుకీ కమల నీరసించి పోతూంది, దగ్గు ఎక్కువై పోతూంది. ఎవ్వరూ గమనించడం లేదు. ఒకనాడు మరీ బాధగా దగ్గుతూ కూచుంది కమల. శివరామ్ విన్నాడు, అమ్మనడిగాడు. అమ్మ నాకు తెలియదంది. అనవసరంగా భార్యతో మాట్లాడే అలవాటు లేదు శివరామ్‌కి. అయాచితంగా కష్టసుఖాలు భర్తతో చెప్పుకొనే స్వాతంత్రం కమలకీ లేదు. ఇప్పుడతను అడిగితే"ఏమో నాకు తెలియదు. ఎందుకో ఈ దగ్గు" అంది కమల.

ఆఖరుకి ఒకనాడు అంకాలు భార్యని వెంటపెట్టుకుని కమలని లేడీడాక్టరు వద్దకి తీసుకెళ్ళాడు శివరామ్. ఆవిడ పరీక్ష చేసి "శివరామ్ గారూ! మీరు చదువుకున్నవారు. మీరు ఇన్నాళ్లు ఎలా ఉపేక్ష చేశారు? ఇది క్షయ" అని సానుభూతితో అంటూ, ఒక మందులపట్టీ వ్రాసి ఇచ్చింది.

ఇంటికి వచ్చి జరిగినదంతా అమ్మతో చెప్పాడు శివరామ్. అమ్మ మాట్లాడలేదు. విగ్రహంలా వింటూ ఉండిపోయింది.

శివరామ్‌కి ఏమిచెయ్యాలో బోధపడలేదు. కాలు కాలినపిల్లిలా అటూ ఇటూ తిరిగాడు. ఇంట్లో ఈ రోగిని పలుకరించే మనిషికూడా లేరు. అందుకని కమలని ప్రక్క పల్లెటూరిలో తన పినమామగారింటికి తీసుకెళ్లి వదలి కాస్త ఆలనా పాలనా చూస్తుండమని చెప్పాడు. కాని మందులెలా వస్తాయి?

అదేమి ఖర్మమో ఎప్పటిలా జీతపు రాళ్లు అమ్మ దోసిళ్ళలో పోస్తూనేవున్నాడు శివరామ్. వేరు విధంగా చెయ్యాలని అతనికి స్ఫురించనైనా స్ఫురించలేదు.

నాలుగైదు దినాలకొకసారి వెళ్లి కమలని చూచి వస్తున్నాడతను.

"మీ బస్తీలలో కంటె ఇక్కడేమంత

## కుటుంబ నియంత్రణం

అర డజనుమంది పిల్లలతో ఒకావిడ సిటీ బస్సెక్కింది. పిల్లల గోల భరించలేక కండక్టరు "అందర్నీ వెంటేసుకు రాకపోతే సగం మందిని ఇంటిదగ్గర దిగవిడిచి రాకపోయావుటమ్మా!" అని విసుక్కున్నాడు.

పిల్లల తల్లి శాంతంగా "ఇప్పుడు చేసిన పని అదే నాయనా!" అంది.

ఏర్పాటు లుంటాయిరా? ఏదయినా మందు ఇప్పించాలిగాని" అన్నారు పిన మామగారొకసారి శివరామ్‌తో. నిజంగానే ఆనాటి కానాటికి క్షీణిస్తోంది కమల. పోనీ వాళ్ళనే కాస్త డబ్బడుగుదామా అనుకుంటే పిన మామగారూ మరీ అంత కలిగినవాళ్లు కారాయె. ఆ సాయంత్రం కమలతో శివరామ్ అన్నాడు : "అవునూ, చేతిలో వెన్న పెట్టుకుని నేతికి దేవులాడినట్టూ ఇదేమిటి? నీ మెళ్ళో ఆ చంద్రహారం ఇలా ఇయ్యి. అది తాకట్టుపెట్టి మందులు కొనుక్కొస్తా."

దానికి "ఊఁహూఁ! నేనివ్వను. ఇది మామగారు పెళ్లికి పెట్టారు; ఇది తీసుకునేందుకు మీకు ఏమీ హక్కులేదు" అంది బలహీనంగా తలవూపుతూ.

మరోసారి, ఇంకోనాడు అడిగిచూచాడు శివరామ్. "ఇదిగో చూడు పరిస్థితులేమీ బాగాలేవు. అమ్మ ప్రాణంపోయినా డబ్బిచ్చేటట్టుగా లేదు. ఆ చంద్రహారం ఇయ్యి. లేకపోతే నీవు నాకు దక్కవు.' అన్నాడు. కమల గట్టిగా తల ఊపింది. 'నాకు బ్రతకాలని ఏమీ లేదులెండి. నా ప్రాణాలు నిలవాలని అత్తగారికేలేనపుడు మీకెందుకింత ప్రయాస? నా కెందుకు?" అంది ఆయాసంతో.

మరో వారం దినాలకి కమల పోయింది.

శివరామ్ దుఃఖంతో "అమ్మా కమల పోయింది. వెళదాంరా" అన్నాడు. ఆమె జవాబైనా ఇవ్వలేదు.

ఆ మరునాటి సాయంత్రం, భార్య పాదాలకు దణ్ణంపెట్టి, సాగనంపి, పినమామగారి మిద్దెమీద ఆరుబైట, నడుం వాల్చాడు శివరామ్. పైన విదియనాటి ఆకాశం, నీలంగా, విశాలంగా, అనంతంగా అలముకుంది.

కమల ఏది? ఆ జీవి ఎటు వెళ్ళిందో! ఆ అంతరిక్షంలోకి పోయిందేమో! ఎంత దూరం వెళ్ళిందో; తిరిగి రాదేమో! గుండెలు ఎంత గభేలు మంటున్నాయి తలుచుకుంటే. కన్నీళ్ళు ఎండిపోయాయి. ఏడుపు రావడంలేదు.

శివరామ్‌కి ఏదో గొప్ప బాధనుంచి ఒడ్డుకి వచ్చినట్టూ అనిపించింది. కాని ఏదో పెద్ద ఒంటరితనం అతనిచుట్టూ ఆవరించింది. ఎంత నీలంగా ఉందో పైన ఆకాశం! ఆ నీలిమ కొంత శాంతి నిచ్చింది. కాని ఎప్పుడూ ఈ ఆకాశాన్ని ఇల్లా చూస్తూండగలమా? దూరాన్నించి కొండలూ ఇలాగే కనబడతాయి. సృష్టిలో విస్తీర్ణతలన్నీ నీలమే. కృష్ణ పరమాత్ముడూ అదే ఛాయ. శివుడి కంఠంలోనూ నీలమే గదా! ఏమిటో, మనస్సు బరువుగానే వుంది. కమలకి మందిప్పించినట్టయితే బాగుండిపోను. ఎవరిప్పిస్తారు! అవును ఆమె అత్తగారికే పట్టనిదే? ఇంతకీ మేనరికం కావాలని చేసుకుంది కూడాను. ఆవిడ కమలకి అత్తగారా? తనకిమాత్రం తల్లికాదు. అబ్బే! అమ్మ! "అమ్మ" అని పిలవడం ఎలాగు! పిలవకూడదని ప్రతిజ్ఞ పట్టలేదు-ఒకవేళ అలా పట్టేవుంటే. ఎవ్వరికి? ఎవ్వరికీ ఆమాట ఇచ్చింది? తన దారిన తాను వెళ్ళిపోయిన భార్య కిచ్చాడా? తనకితానే బాధలో ఇచ్చుకున్నాడా? ఏమో కాని పిలవడానికి నోరు రావడంలేదు. "అమ్మ!" ఉఁ హూఁ! రావడంలేదు. ఆ పిలుపూ, దుఃఖమూ కంఠంలోనే ఆగిపోయాయి.

ఏమేమో ఆలోచనలు వస్తున్నాయి అతనికి, ఆ ఆలోచనలు బరువుగా వున్నాయి.



శివరామ్ ముఖం, కుంభవర్షాన్ని మోయలేక మోసే శ్రావణ మేఘంలా అయింది.

ఈ వేళ, తన అవసాన కాలంలో శ్రీదేవిగారు, మద్రాసులో కొడుకు శివరామ్ లోగిలిలో మెత్తటిపరుపుపైన పడుకుని వున్నారు. మందులూ, పరిచర్యలూ జరుగుతూనే వున్నాయి. డాక్టర్లు రోజు గడపదని చెప్పారు.

కాని రాత్రి పడింది.

జబ్బు ఎక్కువయిన తరువాతనే ఆవిణ్ని మద్రాసు తీసుకొచ్చారు ఇప్పటికి సుమారు మూడునెలల క్రితం.

జబ్బుతో మంచం మీద పండుకుని ఉన్నన్నాళ్లూ తన గత జీవితమంతా స్ఫురణ కొస్తోందేది. భార్యపోయిన తరువాత శివరామ్ తనలో తానే ఇమిడిపోయాడు. స్వయంగా తన జీతం తల్లి కివ్వడం మానేశాడు; అంకాలుని ఆఫీసుకి తీసుకెళ్ళి జీతం పుచ్చుకుని ఇచ్చి ఇంటికి పంపించేవాడు.

ఇలా సంవత్సరాలు గడుస్తూండగా పిన మామగారు తన కూతుర్నిచ్చి, అట్టహాసం లేకుండా పెళ్ళిచేశాడు.

మరి కొన్నాళ్ళకి మరొక కంపెనీలో పనికి కుదిరి, భార్యా సమేతంగా మద్రాసు వచ్చి కాపురం పెట్టాడు. అక్కడ ఆఫీసుకే అధికారి అయ్యాడు.

ఇంటివద్ద వ్యవహారాలన్నీ, అప్పుడపుడు ప్రక్క ఊరునుంచి వస్తూ పిన మామగారూ, అక్కడేవుంటూ అంకాలూ, చూస్తూ వచ్చారు. శివరామ్ తనకి తోచిన పైకం ముక్తసరిగా మనిఆర్డర్లు చేస్తూనే ఉన్నాడు. కాశీ వెళ్లాలంటే వెలితి లేకుండా డబ్బు పంపించాడు. ఒళ్లు బాగా లేదని వ్రాయించినపుడల్లా,అన్ని మందులూ పంపించాడు.

ఈ లోపుగా శివరామ్‌కి ఒక కూతురు పుట్టింది. కమల అని పేరుపెట్టాడు. తన పంచ ప్రాణాలూ ఆ పిల్లమీదనే పెట్టుకుని బ్రతుకుతున్నాడు తండ్రి. తన తమ్ముడు అపుడపుడూ మనుమరాలిని చూడ్డాని కొచ్చినపుడల్లా సంగతులన్నీ అక్కగారితో చెబుతూండేవాడు తిరిగి వచ్చాక. ఒకొక్కపుడు, మనుమరాలిని తెచ్చుకున్నపుడల్లా, శ్రీ దేవిగారింటికి తీసుకెళ్ళి, కొన్నాళ్ళుంచి మళ్ళీ మద్రాసు తీసుకొచ్చి వదిలి వెళుతూండేవాడు.

గడచిన మూడు మాసాల జబ్బులో ఇవన్నీ ఆలోచిస్తూండేది శ్రీ దేవిగారు.

అయిదు రూపాయిలూ, రెండు కుంచాల వడ్లూ ఇచ్చి దిమ్మరిగా తిరిగే బంగాల పిల్లాణ్ని కొని పెంచుకున్న అంకాలు పాటి అదృష్టం తనకి లేకపోయిందే. అంకాలు కొడుకుపాటి చెయ్యలేదే తను స్వయంగా నెలలుమోసి కనిపెంచిన ముద్దుల కొడుకు. "అమ్మ, అయ్యా!" అంటూ ఆ దిమ్మరి చూడు, వాళ్ళ వెనక ఎల్లా తిరుగుతాడో! వీడికి కన్నతల్లి మీద లేశమాత్రం ప్రేమ వున్నట్టూ లేదే! అంకాలు భార్యపాటి కూడా చెయ్యలేదా తను!

ఎక్కడో కాలంలో మారాన ఒక రాత్రి, ఇరవై ఏండ్లనాటి మాట: "అమ్మా కమల పోయింది. వెళదాం. రా" అన్నది ముద్దుల కొడుకు కంఠం. అంతే. ఈ ఇరవై ఏండ్ల

శూన్యంలో మళ్ళీ ఆ పిలుపు వినలేదు తను. ఒక్కసారి అయినా వినాలని ఎంత ఎంత ఆశపడిందో! కాని ఆశలు నిరాశ లవుతూ వచ్చాయి. తన కొడుకు తనకి కాన పుడు జీవితంలో అర్థంలేదు. ఇన్ని సంవ త్సరాలూ కాచుకుంది ఆ ఒక్క పిలుపు కోసం.

ఎన్నిసార్లో. కొడుకు నడుగుదామా అనుకుంది. ఎలా మాటలాడడం? అసలే చేతకాదే! ఏమిటో. వివరం తెలీని బాధలు దేహాన్ని చుట్టుకున్నాయి. ఇక పక్షవాతం కూడా వచ్చింది. తీసుకొచ్చి దిగబెట్టమంటే. శివరామ్ పినమామగారు. భద్రంగా తన అక్కగారిని తెచ్చి. ఒప్పచెప్పి. కొన్నా ళ్ళండి. మనుమరాలు కమలని "నాలుగు దినాలు మా ఇంట్లోవుండి వస్తుంది లె"మ్మని చెప్పి తీసుకెళ్ళారు.

మద్రాసులో. శ్రీ దేవిగారికి రాచభోగం జరుపుతున్నాడు శివరామ్. మందులు బాగా నడుస్తూనే వున్నాయి. పనిపాటలన్నీ మాను కుని శివరామ్ ఇంటివద్దనే ఉంటున్నాడు కాని "అమ్మా. ఎల్లావున్నా''వని మాత్రం ముఖాముఖిగా కూడా అడగడం లేదు.

శ్రీదేవిగారు నీరసించిపోతున్నారు. ఇహ నెన్నాళ్ళో లేవు.-ఆవిడకి.

ఈ వేళే ఆఖరురోజని మళ్ళీ వక్కాణిం చారు డాక్టర్లు. కాని కట్టకడపటివరకూ చికి త్సలు జరపడం విధి అన్నారు. మందులు జరుగుతూనే వున్నాయి.

తంతి వెళ్ళింది. పినమామగారు భార్య తోనూ. కమలతోనూ బయలుదేరారు. అంకాలు ఉగ్గబట్టలేక. కూడా బయలు దేరాడు.

కోడలు శ్రీదేవిగారి గది వదలడం లేదు.

శ్రీ దేవిగారు శక్తి తెచ్చుకుని. కళ్ళతో కూడా వెతుకుతూండేవారు-ఆ కొడుకు స్వరంకోసం.-పరితపిస్తూ.

ఆ రాత్రి కూడా గడుస్తోంది.

శ్రీ దేవిగారిది చాలా గట్టిప్రాణం అని డాక్టర్లు నిశ్చయించారు.

తిరిగి సూర్యోదయం అవుతూంది.

స్వామి పిలుపు రాలేదు.

కన్నకొడుకు పిలుపుకోసం ఆగారు శ్రీ దేవిగారు.

బయట అరుగుమీద అంకాలు తలవంచు కుని కూచుని వున్నాడు. శివరామ్ ఎప్పటిలా డాక్టరువద్ద నుంచి మందులు పట్టుకునివస్తూ, గుమ్మంలో నించి, "అమ్మా" అన్నాడు పరిపూర్ణ ప్రేమతో. గదిలో, శ్రీ దేవిగారికి ఎక్కడో దూరాన దిగంతాల వెనకనుంచి వినబడినట్టు ఆ స్వరం వినిపించింది.

ఆమె కళ్ళల్లో నీళ్లు నిండాయి. కళ్లు వాటంతటవే విప్పారాయి-మహా తృప్తితో.

ఆ ఒక క్షణం కోసమే ఆ కళ్ళలో ఆ కాంతి ఆగివుంది-ఇంకా. శివరామ్ లోపలి మండువాలోకి వచ్చాడు. ఎదురుగా చూస్తూ "అమ్మా కమలా! వచ్చావుటే!" అన్నాడు.


గదిలో శ్రీ దేవిగారి కండ్లు మూతలు పడ్డాయి. తల ప్రక్కకి వాలిపోయింది. కళ్ళ కొలుకులలోనుంచి నిండిన కన్నీళ్లు జారాయి.

పెరట్లోనించి పినమామగారి గొంతు వినిపిస్తోంది..."మనో మన్యుర్మమర్మృత్యు స్పత్యో మిత్రో వాయురాకాశః ప్రాణోలోక పాలః..."

●







# 'అకవితా వస్తువు?'

[మేరిలిన్ మన్రో కూడా కవితా వస్తువేనా? అని సందేహించిన ఒక మిత్రుని కోసం.-]

నీ ప్రతి అవయవం
  సౌందర్యాన్ని నిర్వచిస్తున్నది
నీ ప్రతి హావభావం
  యవ్వనాన్ని నిర్ణయిస్తున్నది
లోకమంతా నీ అతిలోక
  రూపాన్ని చూసి
నోరు తెరుచుకొని
  ప్రమాన్పడి పోతుంటే
ఏ అలౌకిక సౌందర్యాలు
  వివరిద్దామని